క్లుప్తంగా

రామలింగేశ్వరుని తాకిన సూర్యకిరణాలు



రామలింగేశ్వరునిపై ప్రసరిస్తున్న సూర్య కిరణాలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వరస్వామిని ఆదివారం సూర్య కిరణాలు తాకాయి. ఉదయం స్వామివారిపై సూర్య కిరణాలు పడటంతో స్వామివారు బంగారు వర్ణంలో దర్శనమిచ్చారు. శ్రీరామనవమి, సీతారాముల కల్యాణ శుభసమయాన స్వామివారిని సూర్యకిరణాలు తాకడం శుభప్రదమని అర్చకులు వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేయాలి



రౌతులపూడిలో శాంతి ర్యాలీ చేస్తున్న సంఘాల ప్రతినిధులు

రౌతులపూడి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా ఆదివారం మండలంలోని క్రైస్తవ సంఘాల నేతలు రౌతులపూడిలో శాంతి ర్యాలీ చేపట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి గిడజాం సెంటర్ వరకు ర్యాలీ చేసి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. అక్కడ నుంచి ప్రధాన రహదారిలో సినిమా సెంటర్ మీదుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శామ్యూల్, పాస్టర్లు బండారు బైరాగి, యాదగిరి జ్యోతిబాబు, బర్రే జయబాబు, విశ్వాసకులు యాదగిరి సత్యప్రకాష్, గంటా భాస్కర్, బొడ్డు నాని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయాలంటూ ఆందోళన



నీలాద్రిరావుపేటలో హైవేపై ఆందోళన చేస్తున్న స్థానికులు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వీధిలో సీసీ రోడ్డు వేయాలంటూ స్థానికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శన చేపట్టడంతో ట్రాఫిక్ స్తంభించింది. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ వైఆర్కే శ్రీనివాస్ ఆందోళన కారులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసనకారులు ఆందోళన విరమించారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని సారా స్థావరాలపై ఆదివారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఏలేశ్వరం మండలం జడ్డంగి అన్నవరంలో సారా స్థావరాలపై దాడులు చేసి సారా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.



ఏలేశ్వరంలో స్వామి, అమ్మవార్ల కల్యాణంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



రాజపూడిలో స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



జగ్గంపేటలో స్వామివారిని దర్శించుకుంటున్న తోట నరసింహం



వి.కొత్తూరులో స్వామివారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు తదితరులు

కల్యాణం.. కమనీయం

- వైభవంగా సీతారాముల కల్యాణం
- వేలాదిగా వీక్షించిన భక్తులు
- వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు

ఏలేశ్వరం: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని సీతారాముల కల్యాణం నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దశరథమహారాజు కుమారుడు రాముడికి, జనకమహారాజు కుమార్తె సీతాదేవికి భక్తుల సమక్షంలో వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఏలేశ్వరంలోని సత్యనారాయణస్వామి ఆలయంలోని సీతారాముల ఉపాలయంలో మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల హైమావతి, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ దంపతులతో పురోహితుడు గాధావఝుల సూర్యనారాయణ సీతారాముల కల్యాణం జరిపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పైల విజయ్‌కుమార్, యిజనగిరి ప్రసాద్, సుంకర రాంబాబు, పతివాడ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక దిబ్బలపాలెం, పల్లపువీధి, పైడిమల్లమ్మ వీధిలలోని రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం నిర్వహించారు.

కోటనందూరు: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వేదపండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా రాములోరి కల్యాణ క్రతువును జరిపించారు. వేలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. ఆలయాల వద్ద పానకాలు, ప్రసాదాల పంపిణీ చేశారు. దాతల సహకారంతో మధ్యాహ్నం ఆలయ ప్రాంగణాల్లో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు.

తుని రూరల్: మండలంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. వి.కొత్తూరు రామాలయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పోతల రమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి దంపతులు పీటలపై కూర్చుని సీతారాములు కల్యాణం జరిపించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సర్పంచ్ దుంగల గణపతి రోజామణి, పార్టీ మండల కన్వీనర్ దుంగల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. వల్లూరు, హంసవరం, తేటగుంట, కేఓ.మల్లవరం, చామవరం, ఎస్.అన్నవరం, ఎన్.సూరవరం, కొలిమేరు, లోవకొత్తూరు, దొండవాక, టి.తిమ్మాపురం, రాపాక, చేపూరు, రాజుపేట, హెచ్.కొత్తూరు, అగ్రహారం, ఎస్‌ఎస్‌వీ నగరం, తాళ్లూరు గ్రామాల్లో సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీ సేవ, కల్యాణం నిర్వహించారు.

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో రామగిరికొండ మీద ఏకశిలపై వెలసిన పురాతన సీతాకోదండరాముని కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.



ప్రత్తిపాడులో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పురోహితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మండలంలోని ఎ.మల్లవరం, బలరామపురం, మల్లంపేట, ఎస్.పైడిపాల, రౌతులపూడి, శృంగవరం, పి.చామవరం, ఎస్.అగ్రహారం, పారుపాక, గిడజాం, బీబీ పట్నం, ఉప్పంపాలెం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్ఎస్ పట్నం, గంగవరం, రాజవరం, దిగువశివాడ, బలరామపురం గ్రామాల్లోనూ సీతారాముల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రామాలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

గోకవరం: మండలంలో శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. స్థానిక దాసరివారి వీధిలోని రామాలయంలో వేద పండితుడు ద్విభాష్యం సూర్యవెంకట సుబ్బారావుశర్మ సీతారాముల కల్యాణం నిర్వహించారు. ప్రధాన రహదారి చెంత ప్రసిద్ధిగాంచిన రామసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువైన సీతారాములకు ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథ శర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. స్థానిక మురళీనగర్, అచ్చియ్యపేటలో స్వామివారి ఆలయాలు, బత్తులవారి వీధిలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తంటికొండలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. గుమ్మళ్లదొడ్డిలో ప్రసిద్ధిగాంచిన శ్రీరామగిరి కొండపై కొలువైన భద్రాద్రి సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వెదురుపాక, కృష్ణునిపాలెం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గండేపల్లి: మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. గండేపల్లిలో ఎస్సై యువి శివ నాగబాబు దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి పానకం, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని గండేపల్లి, తాళ్లూరు, నీలాద్రిరావుపేట తదితర గ్రామాల్లో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం, సోమరాయణంపేట, కొండయ్యపేట, నరసయ్యపేట, రమణయ్యపేట, చిల్లంగి, కిర్లంపూడి, జగపతినగరం గ్రామాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జగపతినగరం, రమణయ్యపేట రామాలయాల వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రత్తిపాడు: మండలంలోని ప్రత్తిపాడు, టి.రాయవరం, ఏలూరు, చినశంకర్లపూడి, పెద శంకర్లపూడి, లంపకలోవ గ్రామాల్లోని సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రత్తిపాడు జక్కావారి వీధి రామాలయంలో శీరం పవన్‌కుమార్, పూజశ్రీ దంపతులు పీటలపై కూర్చుని రాములోరి కల్యాణాన్ని జరిపించారు. తోటవీధిలో, గోకవరపు వీధి, మునసబుగారి రామాలయం, వర్వత గుర్రాజు రామాలయం, పెద్దవీధి, కొత్తపేట, ఎంప్లాయిస్ కాలనీ తదితర రామాలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి గుడాల వెంకటరత్నం, ఎంపీటీసీ సేంద్రపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిలకమర్తి వెంకటరమణ, శేరు కృష్ణ తదితరులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి, ఉత్తరకంచి, పెద్దిపాలెం, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, యాజీ పురం, పోతులూరు, వాకపల్లి, వేములపాలెం, రౌతుపాలెం, యజీ పురం తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోత్తంగా నిర్వహించారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనులార తిలకించారు. పలు గ్రామాల్లో రామాలయాల వద్ద అన్నసంతర్పణ నిర్వహించారు. ధర్మవరం పద్మశాలి రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

శంఖవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండితులు సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులు భారీగా తరలివచ్చి చేసి కల్యాణాన్ని తిలకించారు. పలు రామాలయాల వద్ద అన్నదానం నిర్వహించారు.

తుని: పట్టణంలోని మార్కెట్ యార్డు, గణపతినగర్, మార్కండ్రాజుపేట, సీతారాంపురం, అమ్మాజీపేట, పాత బజారు వీధి, బెల్లపువీధి, బాలికోన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికలపై సీతారాముల ప్రతిమలను ఉంచి పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీల సభ్యులు, ప్రజాప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. బెల్లంతో తయారు చేసిన పానకం భక్తులకు పంపిణీ చేశారు. పలు చోట్ల అన్న ప్రసాద వితరణ చేశారు. పలు పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలవ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. జగ్గంపేట టీచర్స్ కాలనీలో సీతారాములను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు సీతారాములను దర్శించుకుని స్వామివారి కల్యాణం జరిపించారు. రాజపూడిలో జరిగిన కల్యాణ వేడుకల్లో జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. జగ్గంపేటలోని పుంత, శెట్టిబలిజీపేటతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో తోట నరసింహం, జ్యోతుల నెహ్రూ, జ్యోతుల చంటిబాబు, పలువురు నేతలు పాల్గొన్నారు.



ములగపూడి రామగిరి కొండపై సువర్ణపుష్పాలంకరణలో దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

పైడికొండలో 'ముద్రగడ' ప్రత్యేక పూజలు

తొండంగి: మండలంలోని పైడికొండలో నరిశె శివాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, సిరి దంపతులు పాల్గొన్నారు. సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణోత్సవం జరిపించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నరిసే అబ్బు, సర్పంచ్ నరిసే తాతీలు, రామకృష్ణ, నరిసే రవి రిసే ఉమాశంకర్, నరిసే దొరబాబు, నాగేశ్వరరావు, పెత్తందారు, లగిశెట్టి కనకబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని తొండంగి, రావికంపాడు, బెండపూడి, సీతారంపురం, ఎ.కొత్తపల్లి, కొమ్మనాపల్లి, వేమవరం, పెరుమాళ్లపురం తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.



పైడికొండలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న ముద్రగడ గిరిబాబు, సిరి దంపతులు



గోకవరంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు



ధర్మవరంలో సీతారాములను దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మురళీకృష్ణంరాజు



జగపతినగరంలో స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు



జి.కొత్తపల్లిలో సీతారాముల కల్యాణం


కోడి పందేలాడుతున్న 14 మంది అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలోని వెంకటనగరం –ఉద్దండ జగన్నాథపురం గ్రామాల మధ్య ఏలేరు ఎడమ కాలువ సమీపంలో కోడి పందేల శిబిరంపై ఆదివారం రాత్రి ప్రత్తిపాడు పోలీసులు దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 14 మంది నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,950 నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నట్టు ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంపుల మాటున చౌర్యం

- గ్రామాల్లో పంచాయతీ కుళాయిల నుంచి తాగునీటి చోరీ
- మోటార్లతో తోడేస్తున్న వైనం
- శివారు ప్రాంతాలకు అందని నీరు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తుని రూరల్: గ్రామాల్లో పలువురు సంపుల మాటున తాగునీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. ఇళ్లల్లో పంచాయతీ కుళాయిలు ఉన్నప్పటికీ ఇంటిలో సంపూర్ణ నీటి అవసరాలు తీర్చుకునేందుకు అనుమతి లేకుండా మోటార్లు అమర్చి జలగాల్లా రక్షితనీటిని తస్కరిస్తున్నారు. దీంతో పలు గ్రామాల్లో శివారు ప్రాంతాలకు, ఎగువ ప్రాంతాలకు కుళాయిలు ద్వారా తాగునీరు చేరడం లేదు. చేపూరు, హంసవరం, జగన్నాథపురం, డి.పోలవరం, తొండంగి, బెండపూడి, ఎస్.అన్నవరం, తేటగుంట, తాళ్లూరు, తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. వేసవి కావడంతో పేద, మధ్య, ధనిక అనే భేదం లేకుండా అందరికీ నీటి అవసరాలు పెరిగాయి. గ్రామాల్లో నివశిస్తున్న జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా చేస్తున్నా చౌర్యంతో ఎద్దడి క్రమంగా పెరుగుతోంది. అధికారులు మేలుకోకపోతే రానున్న మూడు నెలలు తుని నియోజకవర్గ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పేటట్టు లేదు. గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు, మండలస్థాయి అధికారులు స్పందించి కుళాయిలకు అక్రమంగా ఏర్పాటు చేసిన మోటార్లను తొలగించాలని గ్రామీణులు కోరుతున్నారు.



కృష్ణనగర్‌లో సంపు నుంచి డాబాపై ట్యాంకుకు అక్రమంగా మళ్లించిన కుళాయి పైపులు



ఎస్.అన్నవరంలో సంపులో కుళాయికి పైన అక్రమంగా అమర్చిన మోటారు



ఎస్.అన్నవరంలో కుళాయి నీరు తోడేందుకు అమర్చిన విద్యుత్ మోటారు

చోద్యం చూస్తున్న అధికారులు

తాగునీటి చౌర్యం జరుగుతున్నట్టు తెలిసినప్పటికీ క్షేత్రస్థాయి అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. అరకొరగా మోటార్లు తొలగింపునకు చర్యలు చేపట్టినా రాజకీయ ఒత్తిడితో చేసేదిలేక చోద్యం చూస్తున్నారు. దీంతో తాగునీటి అక్రమార్కులకు మరింత బలం చేకూరుతుంది. ఒకరిని చూసి మరొకరు అన్నట్టు గ్రామాల్లో అక్రమ మోటార్ల సంఖ్య వందలు దాటగా నియోజకవర్గంలో వేలసంఖ్యకు చేరుకున్నట్టు తెలుస్తుంది.

తాగునీటి చౌర్యాన్ని అరికట్టాలి

గ్రామాల్లో నీటి చౌర్యం అధికంగా ఉంది. స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఐక్యంగా తాగునీటి చౌర్యాన్ని అరికట్టాలి. అవసరమైతే పోలీస్, రెవెన్యూ అధికారుల సహకారం తీసుకుని, కేసులు నమోదు చేయాలి. మోటార్లతో కుళాయి నీళ్ల పంపింగ్ చేయకపోతే మిగులు తాగునీటి నిల్వలు ఉంటాయి. కుళాయిల నిర్వహణతోనూ తాగునీటి అక్రమాలకు అడ్డుకట్టు వేయవచ్చు. కుళాయిలు లేని ప్రాంతాల్లో అవసరమైతే వేసవి దృష్ట్యా బోరుబావులు వేస్తాం.



– ఎ.శివాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, తుని

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వాటర్ ట్యాంకుల నిర్మాణం

గతంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తక్కువగా ఉండేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల్‌జీవన్ మిషన్ పథకాన్ని అమలు చేసింది. దీంతో తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో 120 ఓవర్ హెడ్ ట్యాంకులు, వేలాదిగా ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో కొంతమంది బడాబాబులు, బహుళ అంతస్తు భవనాలు ఉన్న యజమానులు ఇళ్లల్లో సంపులు ఏర్పాటు చేసుకుని కుళాయి నీరు నింపుకుని ఆ తర్వాత మోటార్లతో పైఅంతస్తులో ఉండే ట్యాంకుల్లో నీరు నిల్వ చేసుకుంటున్నారు. ఈ నీటినే తాగు, వాడకపు నీటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న మరికొంత మంది నేరుగా కుళాయిలకే మోటార్లను ఏర్పాటు చేసి నీరు తోడేస్తున్నారు. ఇలా నీటి చౌర్యం జరుగుతుండడంతో శివారు ప్రాంతాల్లో గృహాలకు, ఎగువ, మొట్ట ప్రాంతాల్లో ఇళ్లకు కుళాయి నీరు చేరడం లేదు. అరకొరగా లభించిన నీటితోనే రోజులు గడిపేస్తున్నారు. కొంత మంది సమీప పంట పొలాల్లో ఉన్న బోరుబావులు నుంచి నీళ్లు తెచ్చుకుని తమ అవసరాలను తీర్చుకుంటున్నారు. ఇటీవల ఎస్.అన్నవరం మేజరు పంచాయతీలో ఎంపీడీఓ సాయి నవీన్, కార్యదర్శి వీరలక్ష్మి ఆధ్వర్యంలో ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో పర్యటించి అక్రమంగా అమర్చిన మోటార్లను తొలగించారు. అన్ని గ్రామాల్లోనూ కుళాయిలకు అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను తొలగించాలని గ్రామీణులు కోరుతున్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



గోకవరంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు



ములగపూడిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

గోకవరం/ఏలేశ్వరం/ప్రత్తిపాడు/రౌతులపూడి/కిర్లంపూడి/ప్రత్తిపాడురూరల్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భావ వేడుకలను తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించారు. గోకవరం తంటికొండ రోడ్డులోని బీజేపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సుమారు 70 అడుగుల జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వాస్పత్రి సమీపంలో నిర్వహించిన వేడకల్లో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సత్తి వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం మండలం యర్రవరం, ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి, రౌతులపూడి మండలం ములగపూడిలో నిర్వహించిన వేడుకల్లో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ పాల్గొని పార్టీ జెండాలను ఆవిష్కరించారు. సిరిపురంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.